RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 243 | ఆగస్టు 26, 2025 | వెల : రూ.3-00



ముగిసిన “ఏ ఐ ఫర్ గుడ్ ” హ్యాకథాన్

2లో..

# యువ నాయకత్వం దేశానికి అవసరం

- ఓయూని ప్రపంచంలోనే అద్భుతమైన విద్యాలయంగా తీర్చిదిద్దుతా
- సీఎం రేవంత్ రెడ్డి
- వర్సిటీలో పలు భవనాలకు శంకుస్థాపన



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ చరిత్రకు సజీవ సాక్ష్యమైన ఉస్మానియా యూనివర్సిటీని ప్రపంచం లోనే ఒక అద్భుతమైన విద్యాలయంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ చరిత్రను నిక్షిప్తం చేసిన, తెలంగాణ పదానికే ప్రత్యామ్నాయంగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంత చేసినా తక్కువే అవుతుందని అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థినీ విద్యార్థుల కోసం నూతన హాస్టల్ భవనాలు, లైబ్రరీ రీడింగ్ రూమ్ నిర్మాణాలకు ముఖ్యమంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే, కొత్తగా నిర్మించిన దుందుభి, భీమ హాస్టల్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉస్మానియాను ఒక అద్భుతమైన వర్సిటీగా తీర్చిదిద్దడానికి ఇంజనీరింగ్ నిపుణులు, విద్యా శాఖ నిపుణలతో ఒక కమిటీని నియమించి సమగ్రమైన అంచనాలు రూపొందించాలని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా గారిని ఆదేశించారు. స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీల ప్రమాణాలను మించి ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులైనప్పటికీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.



విద్యా రంగానికి ఈ ఏడాది 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామన్నారు.

“ఉస్మానియా కోసం వెయ్యి కోట్లు ఖర్చు చేయడానికి ఇబ్బందేమీ లేదు. రాష్ట్రంలో వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం రూ. 20వేల కోట్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి రూ. 500కోట్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, పోలీస్ స్కూల్ కోసం వందల కోట్లు ఖర్చు పెడుతున్నాము” అని చెప్పారు. “ఉస్మానియా యూనివర్సిటీ కాలగర్భంలో కలవొద్దు. ఈ వర్సిటీ చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలవాలి. ప్రపంచ ప్రమాణాలతో అద్భుతమైన వర్సిటీగా రూపొందించడానికి ఏం కావాలో అడగండి. రాష్ట్ర సాధనలో ముందు భాగంలో నిలబడిన ఈ యూనివర్సిటీని గాలికొదిలేయడం సరికాదు. ఈ యూనివర్సిటీకి మరోసారి వస్తా. ఈసారి ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా సభ పెట్టుకుందాం. యూనివర్సిటీని అభివృద్ధి చేయడంలో నాకు చిత్తశుద్ధి ఉంది. అంచనాలు రూపొందించండి అని” అన్నారు. “తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భాగస్వామ్యం తీసుకున్న ఎంతో మంది విద్యార్థులు, నాయకులు ఇక్కడి నుంచి వచ్చిన వారే. తెలంగాణ సమాజానికి సమస్యలున్నా, సంక్షోభం వచ్చినా మొదట చర్చ జరిగేది ఉస్మానియా నుంచే ఆ సమస్య మాది అని భావించేదే ఈ నిలయం. ఎంతో ఘన చరిత్ర

మిగతా 3వ పేజీలో..



## సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– డాక్టర్ సత్యనారాయణ, కార్తీక్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వర్షాకాలం నేపథ్యంతో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ సత్యనారాయణ అన్నారు. వేమనపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంతో ప్రజలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరు కూడా అనారోగ్యానికి గురికాకుండా ఉచిత ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ సయ్యద్ జాన్, వెంకన్న, జీనత్ జహాన్, జ్యోతి,వెంకట్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మెడికల్ షాప్ లను డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఆకస్మిక తనిఖీ



**వేద న్యూస్, భీమదేవరపల్లి :**

భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో పలు మెడికల్ షాప్ లను డ్రగ్స్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ సోమవారం నాడు తనిఖీ చేశారు. మెడికల్ షాప్స్ డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ 1940 ప్రకారం సదురు మెడికల్ షాపులు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అని తనిఖీలు చేశారు. దాదాపు 6 మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఎంటిఫి కిట్లు ( అబార్టీ ఫేషియెంట్ టాబ్లెట్లు) అనధికార విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా వైద్యుల డిస్క్రిప్షన్ లేకుండా అమ్మకం, హెచ్, హెచ్ 1 షెడ్యూల్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం, ఈ ఉల్లంఘనలపై సంబంధిత మెడికల్ షాప్ లపై కేసులు నమోదు చేశారు. ఎంటిపీ కిట్ల విక్రయంలో డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టం 1940, 1945 ను ఉల్లంఘించే ఫార్మసీలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



– సీఐ సుధాకర్ రెడ్డి

**వేద న్యూస్, కాజీపేట :**

రాబోవు వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కాజీపేట సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం కాజీపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేష్ మండపాల సంబంధించిన నిర్వాహకులు, పీస్ కమిటీ మెంబర్స్ తో రానున్నటువంటి వినాయక చవితి ఉద్దేశించి మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఈ మీటింగ్లో నిర్వాహకులకు వినాయక చవితి నవరాత్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు వివరించామన్నారు. అన్ని మతాలవారు కలిసిమెలిసిగా పండు గను శాంతియుత వాతావరణంలో జరుపుకొని, అదేవిధంగా నిమజ్జనం రోజు కూడా ఎవరికి ఇబ్బంది కలగకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ముగించాలని పలు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఎస్ఐలు, పీస్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**వేద న్యూస్,వరంగల్:**

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమర్పించిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమానికి 151 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 58, జిడబ్ల్యూ ఎంసీ 30, గృహ నిర్మాణ శాఖ 12, సహాకార శాఖ 7, పౌర సరఫరాల శాఖ 5, ఇతర శాఖలకు సంబంధించిన 39 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు మానవీయ కోణంలో పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిబిసిడిఓ పుష్పలత, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలనే పూజిద్దాం



– కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్,వరంగల్:**

నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే పూజించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్లో సోమవారం మట్టి గణపతి విగ్రహాలను పూజించాలనే పోస్టర్ను ఆవిష్కరించి, అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్

మిగతా 3వ పేజీలో..

## మళ్లీ యూరియాకు రైతుల క్యూ లైన్లు

– ప్రైవేటు డీలర్లకు అలాట్ అయిన యూరియా బ్లాక్ కు వెళ్తుందా..?



4లో..

## దూకుడు పెంచిన ఏసీబీ

- అభివృద్ధి పనుల్లో భారీగా పర్సంటేజీల రూపంలో వసూళ్లు
- ఆదాయానికి మించి పెద్ద ఎత్తున ఆస్తులు
- ఒక్కొక్కరి వద్ద వందల కోట్ల స్థిర, చరాస్తులు

4లో..



# వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గణేష్ మండప నిర్వాహకుల తో సమావేశం నిర్వహించినట్టు బోయినిపల్లి ఎస్ ఐ రమాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, మాట్లాడుతూ ప్రతి పండుగ ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు అన్ని వివరాలతో సంబంధిత పోలీస్ స్టేషన్లో సంప్రదించి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వాటి వివరాల ఆధారంగా ఆన్లైన్ చేయడం విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయడం చేస్తామని, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా శోభయాత్ర సాఫీగా సాగేలా పర్యవేక్షిస్తామన్నారు.

# ఉపాధ్యాయులకు గెజిటెడ్ కల్పించాలి

**వేద న్యూస్, రాయికల్ :**



ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం లేని గెజిటెడ్ హెూదా ను 24 సంవత్సరాల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెూదా కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ అన్నారు. ఆలూర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మండలోజు ఉదయ్ భాస్కర్ ఉద్యోగ విరమణ మహోత్సవ సందర్భంగా ఆయనను ఆర్.యు.పి.పి రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్, చిలుక మర్రి మురళీ మనోహర చారీ, జె గంగనర్సయ్య, యం, బన్న, మోర నరహరి, గాజుల శ్రీనివాస్, తిరుమల మల్లేష్ లు ఘనంగా శాలువాతో సత్కరించి భగవద్గీత ప్రదానం చేశారు. ఆయన ఉపాధ్యాయ జీవితంలో చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ 1/2005 అక్ట్ రద్దు చేసి భాషోపాధ్యాయులకు నియామకం తేది నుండి నోషనల్ సర్వీస్ ప్రొటెక్షన్ కల్పించాలని, 24 సంవత్సరాల సర్వీసు పూర్తి అయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెూదా కల్పించాలని, ప్రాథమిక పాఠశాలల్లో హిందీని ప్రవేశపెట్టి తెలుగు హిందీ పండితులను నియమించాలని కోరారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలి

**వేద న్యూస్, చొప్పదండి :**



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో చొప్పదండి లో ఏర్పాటు చేయనున్న వినాయక మంటపాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు, అదేవిధంగా మంటపాల వద్ద సరైన భద్రతను కల్పించాలని ఎస్సై నరేష్ రెడ్డి లకు విశ్వహిందూ పరిషత్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు కోరారు. ఈ సందర్భంగా పడకంటి కృష్ణ మాట్లాడతూ హిందువులను ఐకమత్యం చేయడానికి తిలక్ ప్రారంబించిన ఈ వినాయక నవరాత్రులు హిందువులు చాలా ఘనంగా జరుపుకుంటారని, ఈ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు నిర్వహించాలని కోరడం జరిగిందని వారన్నారు. మండప నిర్వాహకులు వినాయక మండపాలలో ఈ నవరాత్రులు భక్తి శ్రద్ధలతో పూజలు, భజనలు నిర్వహించాలని, అదేవిధంగా ప్రతి మండపం వద్ద కుంకుమ, గోమాత పూజలు చేస్తూ, ఓం జెండాను ఉంచాలని కోరారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగగుండా పండగ వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటుకం మహేష్, మోలుమురి రమేష్, దూస రాము, పొన్నాల తిరుపతి, చిలుకునూరి లక్ష్మీరాజం, కొక్కుల రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

# కమీషన్ ను వెంటనే విడుదల చేయాలి



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల నుండి కమీషన్ విడుదల కాక అర్ధకలితో అలమటిస్తున్నామని రేషన్ డీలర్లు తహసిల్దార్ కార్యాలయాలకు కదం తొక్కారు. సుదీర్ఘకాలం నుండి ఆవిష్కృతమైన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారులకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ డీలర్లు మాట్లాడుతూ 5 నెలల కమిషన్ రాక అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మా పిల్లల స్కూల్ ఫీజులు, సెప్టెంబర్ మాసంలో బియ్యం దిగుమతి, మడిగా, గుమస్తా జీతాలు ఇవ్వలేక ఆర్థిక ఇబ్బందులతో సతమవుతమవుతున్నామని పేర్కొన్నారు. దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో మొదటి స్థానం నిలిచినప్పటికీ రేషన్ డీలర్ల కమిషన్ విడుదలలో అరిగోశ పెడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ కాకుండా.. గతంలో మాదిరిగానే ఒకేసారి విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రతినెల కమిషన్ డీలర్ల ఎకౌంట్లో జమ చేయాలని కోరారు. ఇప్పటికైనా ఐదు నెలల కమిషన్ వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ముగిసిన "ఏ ఐ ఫర్ గుడ్ " హ్యాకథాన్

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**




బ్లైండ్360 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో, హ్యాక్ కల్చర్, మైక్రోసాఫ్ట్, బ్లడ్ వారియర్స్తో కలిసి నిర్వహించిన ఏ ఐ ఫర్ గుడ్ హ్యాకథాన్ రెండు రోజుల పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్లోని వద్ద జరిగింది. 6,800 పైగా రిజిస్ట్రేషన్లలోంచి ఎంపికైన 100 జట్లు, 170కి పైగా పాల్గొనేవారు ఈ హ్యాకథాన్లో పాల్గొన్నారు. 24 గంటలపాటు సాగిన ఈ పోటీలో, పాల్గొన్న వారు రాత్రంతా మెలకువగా ఇన్నోవాటివ్ సొల్యూషన్లు అభివృద్ధి చేశారు. ముగింపు రోజున, రూ. 2.75 లక్షల నగదు బహుమతులు గెలుచుకున్న మూడు జట్లకు శ్రీ జయేష్ రంజన్, ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటి, ఇండస్ట్రీస్), మరియు అరేకపూడి గాంధీ, ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ చేతుల మీదుగా అందజేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో బ్లైండ్360 నుండి రఘు మంగరాజు, ప్రసాద్ దేశ్పాండే, హరీనాథ్ చల్లా, దవలికా నిమ్మగడ్డ, ఇస్మాయిల్ మొహమ్మద్ తదితరులు, బ్లడ్ వారియర్స్ నుండి సందీప్ కావేటి, కృష్ణ వంశి, అలాగే ఎన్ ఐ ఏ టి నుండి గిరీశ్ ఆకాష్, శశాంక్ గుజ్జులా పాల్గొన్నారు. అంతేకాక, ప్రతిభ కనబరిచిన కొంతమంది విద్యార్థులకు బ్లైండ్360లో ఇంటర్న్షిప్ అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి మేలు చేసే దిశగా కృత్రిమ మేధ (ఏ ఐ) శక్తిని వినియోగించవచ్చని మరోసారి రుజువైంది.

# గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**వేద న్యూస్, వీర్నపల్లి:**



ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని ఎస్ ఐ వేముల లక్ష్మణ్ అన్నారు. సోమవారం వీర్నపల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో గణేష్ చతుర్థి ఉత్సవాల ఏర్పాట్లపై గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై సెప్టెంబర్ 6న నిమజ్జనం చేయనున్నందున, వినాయక మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, నిర్వాహకులు భక్తి శ్రద్దలతో సురక్షిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిమజ్జనం రోజు పోలీసులకు సహకరించాలన్నారు. పరిమితికి మించి డిజె సౌండ్లను పెట్టుకోవద్దని ఎలాంటి గొడవలకు తావు లేకుండా శోభాయాత్ర ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కేబుల్ వైర్లు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

# మట్టి ప్రతిమలను పూజిద్దాం




**వేద న్యూస్, వరంగల్ :**

ఏవివి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో "మట్టి ప్రతిమలను పూజిద్దాం. పర్యావరణహిత ప్రేమికులనవుదాం" అనే పర్యావరణ పరిరక్షణ ర్యాలీని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని వినాయకుడు అంటేనే ప్రకృతి కావున మట్టి వినాయకుల మరియు రసాయన రహిత రంగులను వాడి తద్వారా జల కాలుష్యాన్ని నివారించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవీవి కళాశాల ఎన్ఎస్-ఎస్ గత 20 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని ప్రజలలో మార్పు వస్తుందని మట్టి వినాయకుల తయారీ చాలా పెరుగుతుందని ఇది ప్రస్తుతం 25శాతం ఉన్నదని రానున్న రోజుల్లో 40శాతం కావాలని చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే విద్యార్థులచే మట్టి వినాయకులను తయారుచేసి ర్యాలీ నిర్వహించడం జరిగినది దీని యొక్క ముఖ్య ఉద్దేశం" పిఓపి వద్దు మట్టి వినాయకులే ముద్దు "నినాదంతో పిఓపి మరియు భూమిలో కాలువని వ్యర్థాన్ని రసాయన రంగులను చెరువులు సరస్సులలో కలువకుండా చూద్దాం మరియు మట్టి వినాయకుల వల్ల కలుగు లాభాలను ప్రజలకు తెలియజేస్తూ గణేష్ పూజలో వాడే ఇరవై ఒక్క రకాల పత్రిలు వాటి ఔషధ గుణములతో సర్వ రోగాలు పోతాయని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగినది. అనంతరం అనంతరం శ్రీనివాసరావు తయారుచేసిన ఔషధ మొక్కల విలువలకు సంబంధించిన గోడిపత్రికను ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రిటైర్ అధ్యాపకుడు సర్వేశంగారు, సీనియర్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రబ్బాని, దేవిశ్రీప్రసాద్, సాకేత్, చిరంజీవి, దస్తగిరి, క్రాంతి ,భరత్ ,శివశంకర్ నమ్రత , చందన ,ప్రవళిక, మన్విత, సుహన,వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# యువ నాయకత్వం దేశానికి అవసరం

కలిగిన ఉస్మానియాను కాలగర్భంలో కలిపేయాలన్న కుట్ర జరుగుతున్న సందర్భంలో ఈ వర్సిటీకి పూర్వ వైభవం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణం ఆలోచనలు చేశాం. రాష్ట్రంలోని యూని వర్సిటీలు అన్నింటినీ చదువులకే కాకుండా సామాజిక చైతన్య వేదికలుగా మార్చాలన్న ఆలోచనతో నిర్ణయాలు తీసు కున్నాము" అన్నారు. "ఉస్మానియా వర్సిటీ 108 ఏళ్ల చరిత్రలో దళితుడు వైస్ చాన్సెలర్ కాలేదు. ప్రస్తుతం వీసీ మొలుగరం నైపుణ్యాన్ని గుర్తించి వీసీగా నియమించాం. అలాగే మిగతా యూనివర్సిటీలు, విద్యా కమిషన్‌కు అలాగే నియమించాము"అని న తెలిపారు.

"వర్సిటీలు ఉద్యోగులు, అధికారులను ఉత్పత్తి చేయడానికి మాత్రమే కాకుండా తెలంగాణ పునర్నిర్మాణానికి అవసరమైన మేధాసంపత్తిని అందిస్తుందని ఆశిస్తున్నాం. దేశ జనాభాలో 35 ఏళ్ల లోపు వయసున్న యువత 65 శాతం ఉంది. యువత శాసనసభకు పోటీ చేయాలంటే 25 ఏళ్ల వయ పరిమితిని 21 సంవత్సరాలకు ఎందుకు తగ్గించకూడదో ఆలోచన చేయాలి.

యూనివర్సిటీలు చదువులకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనలకు వేదిక కావాలి. సైద్ధాంతికపరమైన భిన్నాభిప్రాయాలపై చర్చలు జరగాలి. సాంకేతిక పరమైన చర్చలు జరగాలి. వర్సిటీలు, విద్యాలయాల్లో సిద్ధాంతపరమైన పోరాటాలు, సామాజిక చైతన్య ఉద్యమాలు లేని కారణంగా చిన్న చిన్న కాలేజీల్లో కూడా విద్యార్థులు గంజాయి సేవించడం లాంటి వ్యసనాల బారిన పడటానికి దారితీస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంచడానికి భూములు లేవు. ఖజానాలో ఖాళీగా ఉంది. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు నా సూచన ఒక్కటే నాణ్యమైన విద్య ఒక్కటే మన తలరాతలను మార్చగలుగుతుంది. చదువుకునే వయసులో ఇతర వ్యాపకాలకు లోనైతే దారితప్పుతాము"అని సూచించారు.

"విద్యార్థినీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించడానికే ఇక్కడికి వచ్చాను. సమస్యలు పరిష్కరించడానికి వచ్చినప్పుడు వ్యతిరేకించడం ద్వారా అభివృద్ధిని అడ్డుకున్న వారవుతారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఉపాధ్యాయ నియామకాల కోసం కేవలం 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించాం. వచ్చే ఆరు నెలల్లో ఇంకో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. అధికారం చేపట్టి రెండున్నరేళ్ల కాలం నాటికి లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రైవేటు రంగంలో వేల కోట్ల పెట్టుబడులను తేవడమే కాకుండా 1.5 లక్షల ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో కల్పించామని చెప్పారు. అపోహలకు లోను కావద్దు. అనుమానాలు ఉంటే నివృతి చేస్తాం. అబద్దాలను నమ్మకం డి. కొందరు జీర్ణించుకోలేక ప్రతిదానికి అడ్డుపడుతున్నారు. అలాంటి వారు తెలంగాణ సమాజానికి ముసుగేసుకున్న చెదల్లాంటి వారు. ఉస్మానియా వర్సిటీని ఉంచకూడదని, ఎవరూ చదువుకోవద్దని కోరుకునే వారు. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలంటే మీరంతా చదువుకోవాలి. చదువు ఒక్కటే ఈ సమాజాన్ని మార్చగలదు.." అని ముఖ్యమంత్రి సవివరంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, పలువురు ప్రజాప్రతినిధులు, యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సెలర్లు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం, ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**

వినాయకచవితి పర్వదినంను పురస్కరించుకుని మట్టి వినాయకుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ కార్యక్రమంను వివేకానంద నగర్ లో పి ఏ సి చైర్మన్ ఆరెక పూడి గాంధీ కార్యలయం లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తో కలిసి ప్రారంభించి, పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రజలకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పి ఏ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాద్యత తీసుకోవాలని , ఉచితంగా మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉంది అని, మట్టి వినాయకుల పంపీణీ చేపడుతూ పర్యావారణ విషయంలో తమదైన పాత్ర పోషించడం పట్ల ప్రజలు అవగహన కలిగి ఉండలాని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, కాలనీ వాసులు ప్రతి ఒక్కరు సమాజ హితం మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణంను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉంది అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. వినాయక ప్రతిమలను చేసేది మట్టితో అలకరించేది ఆకులతో, పూజించేది పూలతో ,నిమజ్జనం చేసేది నీటితో గణపతి అంటే ఆకృతి కాదు, ప్రకృతి మన సనాతన సంస్కృతి అని పి ఏ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.

మట్టి వినాయకులను పూజించి మన యొక్క పర్యావరణాన్ని కాపాడుకుందాం మరియు చెరువులను కలుషితం చేయకుండా వీలైనంత వరుకు మట్టి వినాయకులను మన యొక్క స్వగృహం ప్రాంగణంలో నే నిమర్జనం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము అని , అదేవిధంగా పర్యావరణ హితం మట్టి గణపతులను పూజించాలని ఈ విషయంలో మహిళలు ముందుండాలని, ప్రతి ఒక్కరికి అవగహన కలిపించాలని, మట్టి వినాయకులను



పూజించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, ఏం డి ఇబ్రహీం, పురెందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,జోగిపేట భాస్కర్, అష్రాఫ్, లక్ష్మణ్ రావు,ఆనంద్, శోభన్, అశోక్ రెడ్డి మరియు కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ సెక్రటరీకి మెమొరండం సమర్పణ

**వేద న్యూస్, కాజీపేట:**

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా ని పిఆర్టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మన్నె చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా సోమవారం కలిసి విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల గురించి చర్చించి, మెమోరాండం సమర్పించామన్నారు. పి.ఆర్.టి.యు తెలంగాణ తరపున, ఉపాధ్యాయుల సంక్షేమం, పాఠశాల విద్యా వ్యవస్థ సజావుగా నడిచే దిశగా క్రింద పేర్కొన్న వినతులను దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ సందర్భంగా లేఖలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ ఎల్ఎఫ్ఎల్ ప్రమోషన్లు,

బి ఇడ్ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు ఎల్ ఎఫ్ఎల్ పోస్టులలో ప్రమోషన్ అవకాశాలు కల్పించాలని, పండిట్ అప్గ్రేడేషన్ పూర్తయినందున, జీవో నెం 11, 12 ప్రకారం ఎస్.జి.టి.లకు కంబైండ్ సీనియారిటీ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 40 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రతి పాఠశాలలో తరగతి వారీగా ఉపాధ్యాయులను నియమించి, తగిన ఎల్.ఎఫ్.ఎల్. హెచ్.ఎం. పోస్టులను మంజూరు



చేయాలని, జీవో 317 వల్ల ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు పంపి న్యాయం చేయాలని, పండిట్ అప్గ్రేడేషన్‌లో మిగిలిపోయిన 506 మంది పండిట్‌లకు తక్షణం ప్రమోషన్లు కల్పించాలని, ఎఫ్.ఆర్.ఏ. నేపథ్యంలో, మహిళా ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల సమయాన్ని ఉదయం 9:30 గంటలకు మార్చే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నామన్నారు. అలాగే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే అన్ని సౌకర్యాలు కల్పించి, తగిన సర్వీస్ రూల్స్ రూపొందించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆర్.వి.ఎం. ఉద్యోగుల సమ్మె కాలానికి వేతనాన్ని మంజూరు చేసి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, విమర్శలకు తావులేని విధంగా శాస్త్రీయ, పారదర్శక విధానాన్ని రూపొందించి, మిగిలిపోయిన ఉపాధ్యాయులకు కూడా సమాన అవకాశాలు కల్పించాలని, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన పిల్లల ఉద్యగ తల్లిదండ్రులకు, వికలాంగ ఉద్యోగ ఉపాధ్యాయులకు బదిలీల నుండి మినహాయింపునిస్తూ ఇటీవలే స్త్రీ,శిశు సంక్షేమం, వికలాంగుల శాఖ విడుదల చేసిన జీవో 34. తేదీ ఆగస్టు 7వ తేదీ 2025 కు సపోర్టింగ్ ఆర్డర్స్ సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాల్సిందిగా కోరటం జరిగిందన్నారు. ఈ విషయాలపై తక్షణమే దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మనవి చేశామని తెలిపారు.

# మట్టి విగ్రహాలనే పూజిద్దాం

మాట్లాడుతూ.. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా బస్ స్టాపులు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో వాల్ పోస్టర్లను ప్రదర్శన చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతులను అందించి పర్యావరణం పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నిర్వహిస్తున్నదని కలెక్టర్ తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్టించి, పర్యావరణ పరిరక్షణకు దోహద పడాలని పిలుపుని చ్చారు. తెలంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రెండు వేల మట్టి గణపతులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజ యలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ సునీత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## టిపిసిసి అధ్యక్షులు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**వేద న్యూస్, చొప్పదండి :**



చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన నిన్న జనహిత పాద యాత్ర లోనీ స్ట్రీట్ కర్నర్ సభలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్

కుమార్ దొంగ ఓట్లతో గెలుపొందిరని, ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారానికి వచ్చిందంటే దొంగ ఓట్లేతో అధికారం వచ్చినామని ఒప్పుకోవడమే అని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఎద్దేవ చేశారు. ప్రజలకూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ప్రక్క త్రోవ పట్టించడం కోసమే జనహిత యాత్రయని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారని తక్షణమే టిపిసిసి అధ్యక్షులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## చిట్టి చేతులతో మట్టి గణపతులు



**వేద న్యూస్, రామడుగు :**

రసాయనాలు పూసిన ఏకదంతుని ప్రతిమలు తయారు చేయకుండా పర్యావరణ హితం కోరుతూ మండలం లోని గోపాల్ రావు పెట్ అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు మట్టి గణపతులకు రూపం ఇచ్చారు. సోమవారం పాఠశాల లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాబోయే బొజ్జ గణపయ్య పండుగను పురస్కరించుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడి పుడమిని రక్షించుకునే భాధ్యత అందరూ తీసుకోవాలని చిన్నారులు ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు.

## టిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా

# రేగుల రాజేందర్




**వేద న్యూస్,చొప్పదండి:**

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం తెలంగాణ ముదిరాజ్ పౌరుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకర బోయిన మహేష్ ముదిరాజ్, సోమవారం రోజు రేగుల రాజేందర్‌కు, టిఎంపిఎస్ ఉపాధ్యక్షులు గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రేగుల రాజేందర్, మాట్లాడుతూ "ముదిరాజ్ సమాజ సమస్యల పరిష్కారానికి కట్టుబడి నిరంతర పోరాటం చేస్తాను. అభివృద్ధి, రాజకీయ చైతన్యం వైపు ముదిరాజులను నడిపించడానికి కృషి చేస్తాను" అని స్పష్టం చేశారు.

## శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం

వేదన్యూస్ డెస్క్ : ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతున్నది. సుంకేశుల, జూరాల నుంచి ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రస్తుతం జలాశయానికి 3,80,415 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. అదే సమయంలో జలాశయం నుంచి తొమ్మిది గేట్లను పది అడుగుల మేర ఎత్తడంతో నీరు నాగార్జున సాగర్‌కు వెళ్తున్నది. జూరాల స్పిల్ వే నుంచి 2,67,527 క్యూసెక్కులు.. సుంకేశుల నుంచి 9,039 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. శ్రీశైలం డ్యామ్ స్పిల్‌వే ద్వారా 2,39,868 క్యూసెక్కులు.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 62,162 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తుందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881.90 అడుగుల మేర నీరుందని అధికారులు పేర్కొన్నారు. పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 269.750 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 215.800 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం కుడి ఎడమ గట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# మళ్లీ యూరియాకు రైతుల క్యూ లైన్లు

## - ప్రైవేటు డీలర్లకు అలాట్ అయిన యూరియా బ్లాక్ కు వెళ్తుందా..? - నిగ్గు తేల్చాలని రైతుల డిమాండ్

**వేద న్యూస్, నల్లబెల్లి:**

రైతులకు మళ్లీ కష్టాలు ఆదిలోనే మొదలయ్యాయి. పంటను కంటికి రెప్పలా కాపాడుకోవడం ఒక ఎత్తు అయితే, పంటకు బూస్టర్ గా పనిచేసే యూరియా దొరకక, యూరియాను పట్టుకోవడం గగనమవు తున్నది. యూరియా వచ్చిందంటే చాలు.. యూరియా కోసం రైతులు క్యూ కట్టి రెండు మూడు రోజులు ఒక బస్తా కోసం వెంపర్లాడిన ఘటనలు జరిగాయి. ఇదే తంతు మళ్లీ వర్షం కాలం ప్రారంభం కాగానే మొదలవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిఏసిఎస్ల ద్వారా, ఆగ్రోస్ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నప్పటికీ మరి వివిధ కంపెనీలకు చెందిన ప్రైవేటు ఫర్టిలైజర్ షాప్ డీలర్లకు అలాట్ అయిన యూరియా ఎక్కడికి వెళుతుంది ?అక్కడ ఎందుకు ప్రతి రైతుకు యూరియా అందివ్వడం లేదని రైతులు.. వ్యవసాయ శాఖ తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పుడిప్పుడే రైతులు మొక్కజొన్న, పత్తిలాంటి పంటలు వేసి యూరియా కోసం ఎదురుచూస్తున్న తరుణం లోనే యూరియా కొరత ఉండడంతో.. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి నాట్లు వేస్తే ఇంకా యూరియా డిమాండ్ పెరుగనున్న నేపథ్యంలో మళ్లీ పాత రోజులు వచ్చాయని గత ఘటనను అన్నదాతలు గుర్తు చేస్తున్నారు.

**- డీలర్లకు అలాట్ అయిన యూరియా ఎక్కడికెళుతుంది...?**

వ్యవసాయ శాఖ అధికారులు పిఏసిఎస్ సొసైటీలకు, ఆగ్రోస్ సేవా కేంద్రాల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నప్పటికీ.. ప్రైవేటు డీలర్లకు అలాటైన యూరియా ఎక్కడికెళ్తుంది, బ్లాక్ మార్కెట్ కు తరలుతోందా, అధిక



రేటు పలుకుతుందా,? లేదా యూరియా బస్తాకు మరేమైన పురుగుమందులు గుట్టు చప్పుడు కాకుండా కలిపేసి దగ్గర దగ్గర రైతులకు డీలర్లు అమ్ముతున్నారా? అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులకు వచ్చిన యూరియా విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేసి.. ఎక్కడికెళ్తుంది యూరియా ? అనేది పసిగట్టి చర్యలు తీసుకోకపోతే యూరియాను పెద్ద మొత్తంలో బ్లాక్ చేసే దందా నడుస్తున్నదని, ఇది వ్యవసాయ శాఖ అధికారులు డీలర్లకు మద్దతు పలకడంతోటే ఇలా జరుగుతుందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**- నానో యూరియా తీసుకోవాల్సిందే**

వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ప్రభుత్వం పిఏసిఎస్ ద్వారా ఆగ్రోస్ ద్వారా యూరియాని పంపిణీ చేస్తూనే నానో యూరియా కొనాల్సిందేనని.. గట్టిగా బలవంతంగా రైతులను కొనేలా చేస్తున్నారు. నానో యూరియా పంటలకు వాడితే లాభాలు జరుగు తున్నప్పటికీ..రైతులకు అవగాహన లేకపోవడంతో అధికారులు పెట్టె ఇబ్బందుల వల్ల నానో యూరియా డబ్బాను కొనాల్సి వస్తుందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. యూరియాకు బదులు నానో యూరియాను స్ప్రే చేయడం ద్వారా.. యూరియా బస్తా ఎంతయితే ఫలితం ఇస్తుందో.. నానో యూరియా సైతం పంటలకు బలం చేకూరుస్తున్నప్పటికీ రైతులకు సరైన రీతిలో అవగాహన లేకపోవడంతో వ్యవసాయ శాఖ రైతుల చేతిలో అభాసు పాలవుతు న్న దని పలువురు పేర్కొంటున్నారు.

# దూకుడు పెంచిన ఏసీబీ

**వేద న్యూస్ డెస్క్:**

ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఆఫీసర్ హోదా, లక్షల్లో జీతం. అయితేనేం కక్కుర్తి. ఇంకా ఇంకా సంపాదించాలన్న దురాశ. తరతరాలకు సరిపడా కూడబెట్టాలన్న చెడుబుద్ధి. ఇదీ రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు అధికారులు, సిబ్బంది తీరు. పనుల కోసం తమ వద్దకు వచ్చే వారిని లంచం కోసం జలగల్లా పీడిస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే పనులు, బిల్లులు ఎక్కడికక్కడా ఆపేస్తున్నారు.

ఇటీవల తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అరెస్టు చేసిన పలువురు లంచగొండి అధికారులు లంచాల సొమ్ముతో సంపాదించిన ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఒక్కొక్కరి ఆస్తుల విలువ వందల కోట్లు ఉండడం అడ్డూ అదుపు లేని వారి అవినీతికి పరాకాష్టగా నిలుస్తోంది. పట్టుబడుతున్న వారు కొందరే ప్రభుత్వ శాఖల్లో తిష్ఠ వేసుకున్న అవినీతి అనకొండలు ఇంకా ఎందరో ఉన్నారు. ఈ నేపథ్యంలో అవినీతి అధికారులు, సిబ్బంది వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వరుస దాడులు చేయిస్తూ వారిని కటకటాల వెనక్కి పంపిస్తోంది. ఇటీవల కాలంలో అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతున్న కొందరు ప్రభుత్వ అధికారుల ఆస్తులను చూస్తే వీరు వెలగబెడుతున్నది నిజంగా ప్రభుత్వ ఉద్యోగమా లేక కార్పొరేట్ కంపెనీలను నడుపుతున్నారా అనే సందేహం రాక మానదు. అంతలా ఉంటున్నాయి వీరి ఆస్తులు. లంచావతారులపై ఫిర్యాదుల ఆధారంగా నిఘా ఉంచుతున్న ఏసీబీ వారిని వలపన్ని పట్టుకుంటోంది.

ఈ అక్రమార్కుల ఇళ్లల్లో సోదాలు జరిపి ఆదాయానికి మించి ఆస్తులు ఉంటే అరెస్టు చేసి జైలుకు పంపుతోంది.




2024లో ఏసీబీ 11 మంది అధికారులపై ఆదాయానికి మించి ఆస్తుల కేసులు నమోదు చేయగా వారి వద్ద గుర్తించిన అక్రమార్జన విలువ అక్షరాల వంద కోట్లు. అనధికారికంగా ఈ ఆస్తుల విలువ సుమారు వెయ్యి కోట్ల రూపాయల వరకు ఉంటుందని ఏసీబీ అధికారుల అంచనా. ఈ ఏడాది ఇప్పటి వరకు నమోదైన ఆరు కేసులలో గుర్తించిన సొత్తు అనధికారికంగా రూ. 500 కోట్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. గత కొంతకాలంగా ఏసీబీ దూకుడుగా అవినీతి తిమింగలాలపై కొరడా ఝుళిపిస్తోంది. దాడి చేసి పట్టుకునే ట్రాప్ కేసులతో పాటు అడ్డగోలుగా అక్రమార్జన చేస్తున్న వారిపై నిఘా పెట్టి ఆదాయానికి మించి ఆస్తులు ఉంటే కేసులు నమోదు చేస్తోంది. గత ఏడాది 129 ట్రాప్ కేసులు, 11 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేశారు. ట్రాప్ కేసులలో బాధితుల నుంచి లంచావతారాలు తీసుకుంటున్న సొమ్మును మాత్రమే పట్టుకుంటున్నారు. గత ఏడాది ఈ విధంగా రూ. 82 లక్షల 78 వేలను పట్టుకున్నారు. విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావుపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ ఆయన నివాసంతో పాటు బంధువులు, కుటుంబసభ్యుల నివాసాలు సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేసింది. ఆయనకు ఆదాయానికి మించిన ఆస్తులు భారీగా ఉన్నట్లు గుర్తించింది. కొండాపూర్‌లో విల్లా, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, బేగంపేట, కోకాపేట్‌లో ఫ్లాట్?లు, హైదరాబాద్‌లో వాణిజ్య భవనం, జహీరాబాద్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టు, వరంగల్‌లో 11 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో నాలుగు ఇంటి ఖాళీ స్థలాలు, మోకిలాలో 6500 చదరపు గజాల ఖాళీ స్థలం, ఖరీదైన బెంజ్ కారు ఏసీబీ అధికారుల దాడుల్లో బయటపడ్డాయి. వీటి విలువ మార్కెట్ రేటు ప్రకారం దాదాపు రూ.150 కోట్లకు పైగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.

# రేవంత్‌పై ఈగ వాలకుండా బీజేపీ కాపాడుతోంది

**వేద న్యూస్ డెస్క్:**

రాష్ట్రంలో యూరియా కొరత ఒకవైపు ఉంటే, రేవంత్ రెడ్డి మరోవైపు సినిమా వాళ్లతో సమావేశాలు పెట్టుకున్నారని కేటీఆర్ విమర్శించారు. "యూరియా కొరతకు 'ఆపరేషన్ సింధూర్' కారణమని బీజేపీ ఎంపీలు చెబుతున్నారు. అందుకే చైనా నుంచి ఎరువులు రాలేదని అంటున్నారట. అసలు మనకు చైనాతో యుద్ధం జరిగిందా? రేవంత్‌పై ఈగ వాలకుండా బీజేపీ కాపాడుతోంది" అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, నరేంద్ర మోదీల మధ్య అనేక పోలికలు ఉన్నాయని, ఇద్దరూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని కేటీఆర్ ఎద్దేవా చేశారు."ఒకరు బడా మోదీ, మరొకరు చోటా మోదీ. ఇద్దరూ కలిసి పని చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలి చూస్తుంటే, ఆయన రేపో మాపో మోదీతో కలిసిపోవడం ఖాయం అనిపిస్తోంది. దీనివల్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకే పెద్ద దెబ్బ తగులుతుంది," అని కేటీఆర్ విశ్లేషించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లుగా ఎనిమిది చొప్పున ఎంపీ స్థానాలను పంచుకున్నా రని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి హామీల వైఫల్యాలపై బీజేపీ ఎంపీలు ఏనాడు ప్రశ్నించడం లేదని, కానీ రేవంత్‌కు రక్షణగా కేసీఆర్‌పై మాత్రం విమర్శలు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. అమృత్ స్కాం, హెచ్‌సీయూ భూముల స్కామ్‌లపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ ఒక్కటేనని కేటీఆర్ అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, విభజన హామీలు - అన్నింటి లోనూ బీజేపీ తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. లక్షల ఉద్యోగాలు కల్పించే ఐటీఐఆర్ ప్రాజెక్టును బీజేపీ రద్దు చేసిందని, హైదరాబాద్‌లోని డిఫెన్స్ కారిడార్‌ను కాదని బుందేల్‌ఖండ్‌కు తరలించిందని ఆరోపించారు. కేన్స్, మైక్రాన్ వంటి సంస్థల రూ. 10 వేల కోట్లకు పైగా పెట్టుబడులను కూడా గుజరాత్‌కు తరలించారని ఆయన వివరించారు. పారిశ్రామిక రంగంలో అన్యాయం, విద్యా, సాగునీటి రంగాల్లో బీజేపీ తీవ్ర మోసం చేసిందన్నారు.



తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల, మెడికల్ కాలేజీ, ఐఐఎం వంటి విద్యా సంస్థలను కూడా బీజేపీ ఇవ్వలేదని కేటీఆర్ గుర్తు చేశారు. అలాగే, పసుపు బోర్డును చిన్న రూమ్‌కు పరిమితం చేసిందని, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు జాతీయ హోదా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెప్పిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అందరినీ మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ 20 నెలల కాంగ్రెస్ పాలన నచ్చకుంటే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రజలు తమ తీర్పు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# అమెరికా ద్వంద్వనీతి



తనకుతాను అగ్రరాజ్యంగా చెప్పుకుంటూ.. ప్రపంచ దేశాలకు పెద్దన్నలా వ్యవహరిస్తున్నానని భావిస్తున్న అమెరికా.. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-గాజా యుద్ధాల పట్ల ద్వంద నీతిని ప్రదర్శిస్తున్నది. ఉక్రెయిన్‌పై రష్యా దాడికి పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరోపిస్తూ.. ట్రంప్ ఇప్పటికే భారత్‌పై యాభై శాతం సుంకాలు విధించారు. అంతేకాకుండా రష్యాకు సహకరించే చైనాతోపాటు ఇతర దేశాలపైనా చర్యలుంటాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో సామాన్య పౌరుల మరణాల గురించి ప్రస్తావిస్తున్న అమెరికన్ ప్రెసిడెంట్‌కు.. ఇజ్రాయిల్-గాజా యుద్ధంలో మరణిస్తున్న చిన్నారులు, మహిళలు, వృద్ధుల మృత్యుఘోష వినిపించడం లేదా? ఆకలితో అలమటిస్తూ పోషకాల లోపంతో మరణిస్తున్న చిన్నారుల ఆర్తనాదాలు చెవికెక్కడం లేదా? స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు అంటూ ప్రపంచానికి ప్రవచనాలు బోధించే అమెరికా.. రెండు ప్రధాన యుద్ధాల పట్ల ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నది. అగ్ర రాజ్యం మాటలు, చేతల మధ్య స్పష్టమైన వైరుధ్యం కనిపి స్తున్నది. దీంతో అగ్రరాజ్యం నైతికతలో రాజకీయ ప్రయోజనాలే ప్రధానమని స్పష్టంగా అర్థమవుతున్నది. నాటోలో సభ్యత్వం కోసం ఉక్రెయిన్ పావులు కదుపు తున్నదని తెలియగానే 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ప్రారం భించింది. అయినా 2022లో ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేయగా.. దాడులను మరింత ముమ్మరం చేసింది. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అగ్రరాజ్యాన్ని సైతం హెచ్చరించింది. అయితే సభ్యత్వం ఇవ్వాలా?వద్దా? అనే దానిపై నాటో దేశాలు ఇప్పటికీ తమ నిర్ణయాన్ని ప్రకటించకపోయినా.. రష్యా దాడులను అవి ఖండించాయి. రష్యా చర్యలను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా, ఐరోపా భద్రతకు ముప్పుగా అభివర్ణించాయి. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా చమురు, గ్యాస్, వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవద్దని ఇతర దేశాలపై ఒత్తిడి తెస్తున్నాయి. అంతేకాకుండా అమెరికాతోపాటు జర్మనీ, బ్రిటన్, నార్వే, డెన్మార్క్, స్వీడన్, నెదర్లాండ్స్, పోలాండ్, లిథువేనియా వంటి యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు, యాంటీ ట్యాంక్ క్షిపణులు.. డ్రోన్లు, ఇతర ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా ఆర్థిక సహకారమందిస్తున్నాయి. మరోవైపు రష్యా ఆస్పత్రులు, పాఠశాలలపైనా దాడులు చేస్తున్నదని గగ్గోలు పెడుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన ఏడాదిన్నర తర్వాత అంటే 2023 అక్టోబర్ లో ఇజ్రాయిల్- గాజా యుద్ధం ప్రారంభమైంది. అయితే ఇక్కడ ఇజ్రాయిల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. పాఠశాలలు, ఆస్పత్రులు, సామాన్య పౌరులు నివసించే ఇండ్లు అనే తేడా లేకుండా బాంబుల వర్షం కురిపిస్తున్నది. చిన్నారులు, మహిళలు, వృద్ధులను సైతం బలితీసుకుంటున్నది. మాన వతా సహాయం అందకుండా అడ్డుగోడగా నిలిచి ఆకలి మరణాలకు కారణమవుతున్నది. కానీ ఇవేమీ అగ్రరాజ్యం అమెరికాకు కనిపించడం లేదు. అయితే గాజాపై దాడులను కనీసం ఖండించని అమెరికా.. మరోవైపు ఇజ్రాయిల్‌కు బిలియన్ డాలర్ల ఆయుధాలను సరఫరా చేస్తున్నది. యుద్ధ నేరాల విషయంలో రష్యాపట్ల కఠినంగా వ్యవహరించిన అమెరికా.. ఇజ్రాయిల్ విషయంలో మాత్రం ఐక్యరాజ్య సమితి భద్రతా మం డలిలో వచ్చిన తీర్మానాలను వీటో చేసింది. ఇజ్రాయిల్ యథేచ్ఛగా అనేక ఉల్లంఘనలకు పాల్పడుతున్నా ఎటువంటి ఆంక్షలు విధించలేదు. కనీసం విమర్శించనూలేదు. గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. 2023 అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో సుమారు 60వేల నుంచి 80 వేలమంది వరకు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవు తున్నది. ఇందులో సుమారు పద్దెనిమిది వేల మంది చిన్నారులు ఉండగా, పదిహేను వేల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. పందొమ్మిది లక్షల మంది నిర్వాసితులయ్యారు. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులున్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టం చేసింది. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ ఎనభై శాతం మంది చిన్నారులు ఉండడం మనసులను కలచివేస్తున్నది. అదే ఉక్రెయిన్‌లో పౌరమరణాలు పకొండు వేల వరకు మాత్రమే ఉంటాయని ఒక అంచనా. అంటే గాజాతో పోల్చుకుంటే ఉక్రెయిన్‌లో మరణాల శాతం చాలా తక్కువ. మానవ హక్కుల విషయంలో రష్యాను పదేపదే విమర్శిస్తున్న అమెరికా.. ఇదే ఇజ్రాయిల్ విషయంలో మాత్రం మౌనంగా ఉండడం అగ్రరాజ్యం ద్వంద్వ నీతికి నిదర్శనంగా నిలుస్తున్నది. అంటే మానవ హక్కులు అనేది రాజకీయ ప్రయోజనాలు సాధించేందుకు ఒక ఆయుధంలా మాత్రమే పనికొస్తున్నాయనేది స్పష్టమవుతున్నది. ఇప్పటికే బ్రెజిల్‌తో పాటు మరికొన్ని దేశాలు అమెరికా ద్వంద్వ వైఖరిని విమర్శించాయి. అగ్రరాజ్యం వహిస్తున్న ఈ వైఖరి అంతర్జాతీయ న్యాయవ్యవస్థ, నైతికతపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తున్నది. ఇది ప్రపంచశాంతి, స్థిరత్వానికి ఎప్పటికైనా ముప్పే. అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కుల పట్ల అందరికీ సమానమైన విధానం అవలంభించడం ద్వారా మాత్రమే అమెరికా అంతర్జాతీయంగా తన విశ్వసనీయతను నిరూపించుకోగలదు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073